క్లుప్తంగా

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు ఫణీంద్ర విద్యానికేతన్ ప్రాంగణంలో శనివారం పూర్వ విద్యార్థుల కలయిక నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బత్తుల సాంబశివరావు, షేక్ ఖలీల్, షేక్ ఖాజాలు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ వ్యవస్థాపకులు భవానీ, రామకృష్ణలతోపాటు పూర్వ అధ్యాపకులు, రాష్ట్రంలోని నలుమూలాల నుంచి పూర్వ విద్యార్థినీ, విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు.

కూరగాయల వ్యాపారికి ఎమ్మెల్యే ఆర్కే చేయూత



మంగళగిరి: వృద్ధాప్యంతో బాధపడుతున్న ఓ కూరగాయల వ్యాపారికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) చేయూతనందించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంకు చెందిన షేక్ ఫరుద్దీన్ అలియాస్ యర్రబాబు బండిపై కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఇటీవల మీడియా ద్వారా ఫరుద్దీన్ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే చలించిపోయాడు. శుక్రవారం ఆయన ప్రతినిధిని మచిలీపట్నంలోని జనశక్తినగర్‌లో నివాసం ఉంటున్న షేక్ ఫరుద్దీన్ ఇంటికి పంపి ఆయన భార్య జహారబీ, కుమార్తె షేక్ షెమ్ము సమక్షంలో రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మా దీన పరిస్థితిని తెలుసుకుని రూ.20వేల ఆర్థికసాయాన్ని అందజేసిన ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలిపారు.

అమరావతి కరకట్టపై రోడ్డు ప్రమాదం

ముగ్గురికి స్వల్ప గాయాలు



తాడేపల్లిరూరల్: ప్రకాశం బ్యారేజ్ అమరావతి కరకట్టపై చిగురు ఆశ్రమం సమీపంలో శుక్రవారం సాయంత్రం రెండు కార్లు ఎదురెదురుగా గుద్దుకోవడంతో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. సచివాలయం నుంచి వచ్చి ఓ అధికారి వాహనం ఎదురుగా వస్తున్న మరో ప్రైవేటు వాహనం గుద్దుకోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో రెండు కార్లు దెబ్బతినడంతో ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. గాయపడిన వారు కూడా ఎటువంటి సమాచారం ఇవ్వలేదు.

యార్డు కమిటీ నియామకం రద్దు

తాడికొండ: తాడికొండ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ నియమకాన్ని రద్దు చేస్తూ శుక్రవారం మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా మార్కెటింగ్ శాఖ ఎండార్స్‌మెంట్‌ను జారీచేసి నియామకాన్ని నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఈలోగానే మార్కెట్ యార్డు చైర్మన్‌గా ఎన్నికైన చిమటా పూర్ణచంద్రరావు, పాలకవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు.

వచ్చే నెల 5న స్కాలర్‌షిప్ టెస్ట్

గుంటూరు ఎడ్యుకేషన్: యూపీఎస్సీ నిర్వహించనున్న సివిల్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఫిబ్రవరి 5న ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు టార్గెట్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ అన్నపురెడ్డి ఉషారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్స్‌కు పోటీ పడుతున్న అభ్యర్థులకు శిక్షణ ఫీజులో 90 శాతం వరకు స్కాలర్‌షిప్ అందించేందుకు నిర్వహిస్తున్న ఎంపిక పరీక్షకు డిగ్రీ పూర్తి చేసిన, చదువుతున్న అభ్యర్థులు ఈనెల 31లోపు దరఖాస్తు చేయాలని ఆమె సూచించారు. స్కాలర్‌షిప్ టెస్ట్‌లో అభ్యర్థులకు వచ్చిన మార్కుల ఆధారంగా వివిధ స్థాయిలో శిక్షణ ఫీజుకు స్కాలర్‌షిప్ అందజేస్తామని తెలిపారు. వివరాలకు గుంటూరు పొన్నూరు రోడ్డులోని కనకదుర్గమ్మ దేవాలయం వద్ద ఉన్న సంస్థ కార్యాలయంతో పాటు 9030562728, 9440989629 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

ప్రభుత్వ మహిళా కళాశాలకు ఓవరాల్ చాంపియన్‌షిప్



గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో గురువారం నిర్వహించిన అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన ప్రభుత్వ మహిళా కళాశాల క్రీడాకారిణుల్ని ప్రిన్సిపాల్ వి.ఆర్.జ్యోత్స్నకుమారి అభినందించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో కళాశాల విద్యార్థినులు ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నట్లు ఆమె శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినుల్ని కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం అభినందించింది.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు నిర్మలా పాఠశాలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పాఠశాల కరస్పాండెంట్ రెవ సిస్టర్ జాన్ పాల్, ప్రిన్సిపల్ రెవ సిస్టర్ జ్ఞాన సుందరి భోగి మంటలతో ఉత్సవాన్ని ప్రారంభించారు. వారు చిన్నారులకు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. విద్యార్థులు హరిదాసు, రైతుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. సంక్రాంతి పండుగ ప్రాముఖ్యతను వివరించే విధంగా విద్యార్థులు నిర్వహించిన డ్యాన్స్, నాటక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జాన్‌పాల్, ప్రిన్సిపల్ సిస్టర్ జ్ఞాన సుందరి మాట్లాడారు.

రోటరీ ఆధ్వర్యంలో

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని మెల్లెంపూడి గ్రామంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు రోటరీ డిస్ట్రిక్ట్ డెసిగ్నేటెడ్‌డీజీలో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు ముప్పంగి వివేకానందరెడ్డి ఆధ్వర్యాన విప్రో కంపెనీ వారి సంతూర్ సౌజన్యంతో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు ముప్పంగి వివేకానందరెడ్డి మాట్లాడారు. సుమారు 200 మంది 28 గ్రూపులుగా ఏర్పడి ముగ్గుల పోటీలు నిర్వహించారు. రోటరీ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ జి.వెంకటరత్నం మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా మహిళలు ముగ్గుల పోటీలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. అనంతరం ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం భోగి మంటలు చేశారు. కార్యక్రమంలో రూరల్ ఏఎస్ఎం విప్రో కన్స్యూమర్ ప్రొడక్ట్ గుమ్మడి శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి కార్యదర్శి కాట్రగడ్డ శివన్నారాయణ, కోశాధికారి శెట్టి రామకృష్ణ, గ్రామ వికాస్ చైర్మన్ చంద్ర ఓబులారెడ్డి, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ప్రొప్రయిటర్ పరమేశ్వర అసోసియేట్, సంతూర్ ఆథరైజ్డ్ డిస్ట్రిబ్యూటర్ తాడేపల్లి వీరిశెట్టి నరసింహారావు, రోటరీ సభ్యులు సుకుమార్ రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రవేంద్రరెడ్డి, ఆర్.సి.సి.మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ పనిముట్ల పంపిణీ...

రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. టార్చి లైట్లు, పలుగులు, స్ప్రే పైపులు, టార్పాలిన్ పట్టాలు మెల్లెంపూడి రైతులకు అందజేశారు.

వైభవంగా భోగి పండుగ వేడుకలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా భోగి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. చిన్నారులకు పాఠశాల హెచ్ఎం సిస్టర్ కొమ్మారెడ్డి నిర్మలామేరి, ఉపాధ్యాయులు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. పాఠశాల ప్రాంగణంలో భోగి మంటలు వేసి పొంగళ్లు పొంగించి సంక్రాంతి పండుగ విశిష్టతను తెలియజేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు పలు వేషధారణల్లో వచ్చారు. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ కరస్పాండెంట్ సిస్టర్ ఆరోగ్యమేరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు



నిర్మలా హైస్కూలులో సందడి చేస్తున్న చిన్నారులు



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న క్లబ్ అధ్యక్షులు వివేకానందరెడ్డి



ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలు



భోగిమంటలు వేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి సభ్యులు



భోగి పండ్లు పోసి ఆశీర్వదిస్తున్న సిస్టర్ కొమ్మారెడ్డి నిర్మలామేరి

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

ఎంవీఐ పవన్‌కుమార్



రోడ్డు భద్రత అవగాహన ర్యాలీ

మంగళగిరి: వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ అన్నారు. రాష్ట్రంలో ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించే రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ప్రపంచ మానవ హక్కుల సమితి, బీసీ సంక్షేమ సంఘం, విజయహెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛత పక్వాడ అనే నినాదంతో వాహన చోదకులకు అవగాహనా సదస్సు నిర్వహించి, అనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత, నిబంధనలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపరాదని, వాహనదారుల నిర్లక్ష్యం కారణంగా ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరిగాయన్నారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ ఎస్ఐలు మహేంద్ర, సురేష్‌బాబు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, ప్రపంచ మానవ హక్కుల సమితి నేషనల్ చైర్మన్ రావూరి బాలరాజు, డిస్ట్రిక్ట్ ఉమెన్ సెల్ చైర్‌పర్సన్ కాగితాల స్వాతి, తిరువీధుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్ పథకం

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, నాయకులు

తాడికొండ: పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం అని తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. తాడికొండ నియోజకవర్గంలో పలువురు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంతో పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీలో అవకాశం లేని రోగాలకు సైతం సాయమందించి పేదలకు బాసటగా నిలిచేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయమందించడం హర్షణీయమన్నారు. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పేదలకు ఇది వరంగా మారి, నేడు ఏపీలో పేదలు సంతోషంగా ఉంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు వినియోగించుకోండి

పట్టణ సీఐ బి.అంకమ్మరావు



మంగళగిరి: సంక్రాంతి పండుగ సందర్భంగా ఊర్లకు వెళ్లేవారు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్) సేవలు వినియోగించుకోవాలని పట్టణ సీఐ బి.అంకమ్మరావు పట్టణ ప్రజలకు సూచించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం ద్వారా ఆయా గృహాలకు సీసీ కెమెరాలు అమర్చుతామని, వాటి ద్వారా చోరీలు జరిగే అవకాశం ఉండదని, ఒకవేళ జరిగినా నిందితులను వెంటనే గుర్తించవచ్చన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నేరాల అదుపు మరింత సులభతరం అవుతుందని తెలిపారు. ఇటీవల నగర పరిధిలోని కాజలో ఎల్‌హెచ్‌ఎంఎస్ సదుపాయంతో నిందితుడిని పట్టుకున్నామని గుర్తు చేశారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను తమ సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని పోలీసులకు సమాచారం ఇస్తే నిఘా పెడతామన్నారు. ఇళ్లల్లోని నగదు, బంగారు ఆభరణాలను బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఎవరైనా పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంప్రదాయాల కొనసాగింపు అభినందనీయం

ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.అనిత




విజేతలను సన్మానిస్తున్న పోలూరి, పక్కన న్యాయమూర్తులు

గుంటూరు లీగల్: సంక్రాంతి పండుగ సందర్భంగా సంప్రదాయాల్ని కొనసాగిస్తూ ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.అనిత అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా న్యాయవాదులకు శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.అనిత, రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఎం.వెంకటశేషమ్మ, నాలుగో అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఎ.సునీత, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గోరంట్ల స్వాతి, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జోష్నశ్రీ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. న్యాయమూర్తులు అన్ని ముగ్గులను పరిశీలించి విజేతల్ని ప్రకటించారు. మొత్తం ఎనిమిది మంది పాల్గొన్నారు. పాటిబండ్ల ఇంద్రజకు మొదటి బహుమతి, నాగ కమల, ప్రత్యూషకు రెండో బహుమతుల్ని అందజేశారు. మిగిలిన వారికి కూడా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. జీబీఏ అధ్యక్షుడు పాలడుగు వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ వేముల జయపాల్, లేడీ రిప్రజెంటేటివ్ ఎం.నాగలక్ష్మి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సిద్ధ సత్యనారాయణ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ తాడిశెట్టి వెంకట ఆనందరావు పాల్గొన్నారు.

విజేతలకు ప్రత్యేక సన్మానం

ముగ్గుల పోటీల్లో విజేతలు, పాల్గొన్న అందరికీ గుంటూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పోలూరి వెంకటరెడ్డి శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. జీబీఏ ఎన్నికల్లో ప్రెసిడెంట్ అభ్యర్థి కాసు వెంకటరెడ్డి, జీపీ పోకల వెంకటేశ్వరరావు, న్యాయవాదులు బుడపాటి కిరణ్, సీడీ భగవాన్, ఏపీపీ వజ్రాల రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ అభినందనీయం



విద్యార్థులతో మురళీ వరప్రసాద్, దీపక్

గుంటూరు ఎడ్యుకేషన్ : గణిత శాస్త్ర అధ్యాపకుడు పులుగు దీపక్ ఆధ్వర్యంలో పండరీపురంలో నిర్వహిస్తున్న ఉచిత జేఈఈ, నీట్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం విశ్రాంత డీఆర్‌డీఓ శాస్త్రవేత్త ప్రొఫెసర్ అందే మురళీ వరప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పుల్ని విద్యార్థులకు వివరించారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు జాతీయ స్థాయిలో జరిగే జేఈఈ, నీట్ పరీక్షలకు ఉచిత శిక్షణ కల్పించడం అభినందనీయమన్నారు. శిక్షకుడు దీపక్ మాట్లాడుతూ విద్యార్థులు తమ చదువును సమాజానికి ఉపయోగపడే విధంగా మలచుకోవాలని, జీవితంలో లక్ష్యాన్ని చేరుకున్నాక తిరిగి సమాజాభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందించాలని సూచించారు.

తాగునీటి ఫిల్టర్ బెడ్‌లకు మరమ్మతులు



నులకపేటలోని ఫిల్టర్ బెడ్‌లకు మరమ్మతులు నిర్వహిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని నులకపేట రైల్వే గేటు వద్ద తాగునీటి శాండ్ ఫిల్టర్ బెడ్‌లకు కార్పొరేషన్ సిబ్బంది శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. శాండ్ ఫిల్టర్ బెడ్‌లలో డస్ట్ పేరుకుపోయి, పాచి పట్టాయి. దానిని గమనించిన అధికారులు రెండు ఫిల్టర్‌బెడ్‌లలో ఉన్న నీటిని ఖాళీ చేసి చిన్నచిన్న మరమ్మతులు నిర్వహించి, ఇతర వ్యర్థాలను తొలగించి శాండ్‌ను మార్చాలని ఆదేశించారు. రెండు ఫిల్టర్ బెడ్‌లలో నీటిని ఖాళీ చేసి కార్పొరేషన్ నీటి సరఫరా విభాగం సిబ్బంది క్లీనింగ్ కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఫిల్టర్ బెడ్‌లో ఉన్న పాచి ఇతర వ్యర్థాలను తొలగించి, ఫిల్టర్ బెడ్‌లో ఉన్న శాండ్‌ను బయటకు తీసి మరలా కొత్త శాండ్‌ను ఏర్పాటు చేశారు. నులకపేట, బ్రహ్మానందపురం, బాబూ జగ్జీవన్‌రావు కాలనీ, ఎర్రక్వారీ, తెల్లక్వారీ ప్రాంతాల్లో తాగునీటి సమస్య రాకుండా ఈ ప్రాంతాల్లో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకులను తాగునీటితో నింపి మరమ్మతులు చేపట్టినట్లు సిబ్బంది తెలిపారు.

విద్యుదాఘాతంతో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ మృతి



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని రేవల్లె కనకదుర్గ వారధి కరకట్ట వెంబడి నివాసముండే ఓ ప్రైవేటు ఎలక్ట్రీషియన్ విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటనపై శుక్రవారం తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ క్లబ్ సమీపంలో రేవల్లె కరకట్ట వెంబడి నివాసముండే శంకరరావు అనంతరావు (51) ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం రాత్రి సమయంలో ఇంట్లో ఉన్న విద్యుత్ మోటరుకు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే అయన కుమారుడు సాయినాథ్ అప్రమత్తమై మెయిన్ ఆఫ్ చేశాడు. అపస్మారక స్థితిలో ఉన్న తండ్రిని సమీపంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సాయినాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి వ్యతిరేకంగా ఫ్యాప్టో నిరసన

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన చేపడుతున్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో శుక్రవారం డీఈవో కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎం. కళాధర్ మాట్లాడుతూ నెలకు రూ.2,500 అలవెన్సుతో ఉపాధ్యాయుల్ని నియమించడం అనేది గతంలో జరగలేదని, దీనివల్ల భవిష్యత్తులో ఉద్యోగోన్నతులు లేకుండా పోతాయని పేర్కొన్నారు. ఆర్థిక అనుమతులు, సర్వీసు నిబంధనలు లేకుండా చేపడుతున్న ఈ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో జేసీ జి. రాజకుమారి, డీఈవో పి.శైలజకు వినతి పత్రాలు సమర్పించారు. నిరసన ప్రదర్శనలో ఫ్యాప్టో జిల్లా డెప్యూటీ సెక్రటరీ జనరల్ ఎండీ. ఖాలీద్, నాయకులు మేకల సుబ్బారావు, కె. బసవ లింగారావు, జి.మోహనరావు, సీహెచ్. నరసింహారావు, పి. ప్రేమ్ కుమార్, డి. పెదబాబు, ఎం. హనుమంతరావు పాల్గొన్నారు.

ఉండవల్లిలో మరో రెండు ఫిల్టర్ ట్యాంక్‌లు



కరకట్ట వెంబడి కార్పొరేషన్ సిబ్బంది ఏర్పాటు చేస్తున్న ఫిల్టర్ ట్యాంక్‌లు

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి ప్రజలకు కృష్ణాజలాలు అందిస్తానని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. దానిలో భాగంగా అమరావతి రోడ్డులో ఇప్పటికే కృష్ణాజలాలు అందించేందుకు రెండు ప్రెజర్ ఫిల్టర్ ట్యాంక్‌లను ఏర్పాటు చేశారు. తాజాగా శుక్రవారం ఉండవల్లి దళితవాడకు వెళ్లే దారిలో కరకట్ట వెంబడి గుంటూరు చానల్ ఒడ్డున మరో రెండు ప్రెజర్ ఫిల్టర్ ట్యాంక్‌లను ఏర్పాటు చేశారు. మరో రెండు ట్యాంక్ ఏర్పాటు చేయాల్సి ఉందని, వాటిని కూడా అమరావతి రోడ్డులో గుంటూరు చానల్ వద్ద ఏర్పాటు చేస్తామని కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి తెలిపారు. ఉండవల్లిలో మొత్తం 4500 నివాసాలు ఉండగా, 16 వేల మంది జనాభా ఉన్నారని, ఉన్నటువంటి ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు ఒక్కొక్క ప్రెజర్ ట్యాంక్ ద్వారా గంటకు లక్ష లీటర్లు శుద్ధి చేసిన తాగునీటిని అందిస్తామని తెలిపారు. పోలకంపాడు, జామాయిల్ తోట ప్రాంతాల్లో శుద్ధిచేసిన నీటిని నేరుగా పంపింగ్ చేయనున్నట్లు డీఈ తెలిపారు. మరో 20 సంవత్సరాల్లో పెరిగే జనాభాకు సరిపడా కృష్ణా జలాలు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని, ప్రస్తుతం రూ.కోటి 20 లక్షల వ్యయంతో 2500 నివాసాలకు శుద్ధి చేసిన కృష్ణా జలాలను అందిస్తామని, మరో వెయ్యి నివాసాలకు డైరెక్ట్ పంపింగ్ ద్వారా తాగునీటిని అందజేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించనున్నట్లు తెలిపారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. వాహనదారులకు కష్టం

● కంకర, మట్టి తోలి వదిలేసిన వైనం ● రెండు నెలలుగా ప్రారంభం కాని పనులు



కంకర పోసి వదిలేసిన వైనం

ఫిరంగిపురం: గుంటూరు–నరసరావుపేట ఆర్ అండ్‌బీ రహదారి నుంచి వేమవరం, 113తాళ్లూరు మీదుగా మేడికొండూరు వరకు తారురోడ్డు నిర్మాణ పనులు రెండునెలలుగా నిలిచిపోయాయి. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన రహదారి పొడవు 11.26 కిలోమీటర్లు కాగా గడిచిన రెండేళ్ల కిందట నిర్మాణ పనులు చేపట్టాల్సిన కాంట్రాక్టర్ మొదలు పెట్టలేదు. ఇటీవల మరలా అదే కాంట్రాక్టర్ రోడ్డు పనులు చేపట్టేందుకు ముందుకువచ్చారు. కంకర, మట్టి పోసి పనులు నిలిపివేయడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో గుంతలతోనే ఇబ్బంది పడుతుండగా ఇప్పుడు కంకర పోసి పనులు నిలిపివేయడంతో వాహనాలపై వెళ్లాలంటే నరకయాతన పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు సైతం ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

అధికారుల సమావేశంలో కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారుల్ని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఇంజినీరింగ్, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం, స్వచ్ఛ సర్వేక్షణ్, అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలనీల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేసుకునేలా సచివాలయ కార్యదర్శులు, నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఉగాది నాటికి ప్రతి లేఅవుట్‌లో గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని చెప్పారు. లే అవుట్ల వారీగా ఎప్పటికప్పుడు పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ భాస్కర్, హౌసింగ్ పీడీ సాయినాథ్‌కుమార్, ఈఈలు సుందరరామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, హౌసింగ్, నగరపాలక సంస్థ డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.